

బోయకొండకు దసరా ముస్తాబు



విద్యుద్దీపాల వెలుగుల్లో చౌడేపల్లెలోని బోయకొండ ఆర్చి

చౌడేపల్లె, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం అంటే 23వ తేదీన బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంతో గంగమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 24న పార్వతీ దేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న ధనలక్ష్మీదేవి, 27 శాకాంబరీదేవి, 28న మహాచండీదేవి, 29న సరస్వతీ దేవి, 30క దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసుర మర్ధినీదేవి, 2న రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నన్నారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో, ఆర్చిల వద్ద, చౌడేపల్లె ఆర్చి వద్ద చేసిన విద్యుద్దీపాల అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.



ఆకట్టుకున్న బొమ్మల కొలువు

పుంగనూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా పుంగనూరు కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం ఉదయం అష్టలక్ష్మి అమ్మవార్లకు అభిషేకాలు జరిగాయి.అద్దాల మండపంలో వెంకట రమణుడు మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. అస్థాన మండపంలో ప్రత్యేకంగా బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు.అలాగే పుంగనూరు బజారువీధిలో వెలసిన వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మూలవర్లకు బంగారు కవచం అలంకరించారు. ఉత్సవవిగ్రహానికి గాజుల అలంకారాలు ప్రత్యేకంగా భక్తులను ఆకర్షించాయి.



బంగారు కవచ అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి



మహాలక్ష్మి అలంకారంలో దుర్గాంబ

దసరా ఉత్సవాల్లో భాగంగా చిత్తూరు గిరింపేట దుర్గాంబ ఆలయంలో సోమవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

23 మండలాల్లో వర్షం



చిత్తూరులో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.మరో ఐదు రోజుల పాటు జిల్లా అంతటా మోస్తరు నుంచి బలమైన వర్షాలు కురుస్తాయని సోమవారం వాతావరణశాఖ అధికారులు బులెటిన్ విడుదల చేశారు. కాగా గడిచిన 24 గంటల్లో 23 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా యాదమరి 55.2 మిమీ, అత్యల్పంగా నగరి, శాంతిపురం మండలాల్లో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా పుంగనూరులో 53.4, గుడిపాలలో 42.2, తవణంపల్లెలో 40.4, చౌడేపల్లెలో 40.2, పులిచెర్లలో 28.0, బంగారుపాళ్యంలో 18.2 సదుం, ఐరాల మండలాల్లో 15.2, గంగాధరనెల్లూరులో 13.0, రొంపిచెర్లలో 12.8, సోమలలో 8.6, పెనుమూరులో 7.6, పూతలపట్టులో 6.6, వెదురుకుప్పంలో 5.4, పాలసముద్రంలో 5.2, రామకుప్పంలో 4.8, గంగవరంలో 4.2, కార్వేటినగరంలో 3.4, కుప్పంలో 2.2, పెద్దపంజాణిలో 1.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

పాతాళ గంగ పైకెగసింది!



ఇరికిపెంట సమీపంలో ఉబికి వస్తున్న పాతాళ గంగ

సోమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట తదితర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. దీంతో వందలాది అడుగుల లోతుకు వేసినా చుక్క నీరు రాని బోర్ల నుంచి పాళాళ గంగ ఉబికి వస్తోంది. ఇరికిపెంట సమీపంలోని పొలంలో విద్యుత్, మోటర్లు లేకుండానే జలం పొంగి ప్రవహిస్తోంది.

వైద్యం కోసం వెళ్తూ తల్లి సహా ఇంజనీరు దుర్మరణం



మునెమ్మ, బాలాజి మృతదేహాలు

నారాయణవనం, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం వెళ్తున్న తల్లీకొడుకులు కారు ఢీకొని దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన నారాయణవనంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు కథనం మేరకు... నింద్ర మండలం ఐఆర్ కండ్రిగకు చెందిన మునెమ్మ(47)ను ఆమె కుమారుడు బాలాజి(28) ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని తిరుపతిలోని ఆస్పత్రికి బయలుదేరాడు. నారాయణవనం మండలంలో చెన్నై - ఊత్తుకోట బైపాస్ రోడ్డు సమీపంలోని టాసా ఫ్యాక్టరీ వద్ద పాలమంగళం నుంచి వస్తున్న కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లీకొడుకులు ఎగిరి రోడ్డు మీద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మునెమ్మ భర్త కేశవులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలాజి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. వైద్యశాలలో భార్య, కుమారుడి మృతదేహాలను చూసి విలపిస్తున్న కేశవులును ఓదార్చడం ఎవరివల్ల కాలేదు.

తమిళనాడుకు గ్రావెల్ తరలించొద్దు

- వనదుర్గాపురం క్వారీలో స్థానికులతో కలిసి టీడీపీ, సీపీఐ నాయకుల ధర్నా



గ్రావెల్ క్వారీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న టీడీపీ, సీపీఐ నాయకులు

పాలసముద్రం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం వనదుర్గాపురం వద్ద ఉన్న క్వారీ నుంచి తమిళనాడుకు గ్రావెల్‌ను తరలించవద్దని స్థానికులతో కలిసి టీడీపీ, సీపీఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. 15 రోజులుగా నగరికి చెందిన వైసీపీ నాయకుడు కేజే కుమార్ కుమారుడు మురళి వనదుర్గాపురం క్వారీ నుంచి తమిళనాడుకు గ్రావెల్‌ను తరలిస్తున్నారని చెప్పారు. దీనిపై గ్రామస్తులకు, క్వారీ యజమానులకు మధ్య వివాదం జరుగుతూనే ఉందని తెలిపారు. అయినా గ్రావెల్ తరలింపు మాత్రం ఆగడం లేదన్నారు. జిల్లా అధికారులు వచ్చేవరకు ధర్నా విరమించేది లేదంటూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అక్కడే బైఠాయించారు. క్వారీ యజమానులు కూడా పనులు ఆపేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అరుణకుమారి, శ్రీరంగరాజపురం



నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీసులు క్వారీ వద్దకొచ్చారు. ధర్నా చేస్తున్నవారితో చర్చించారు. పంచాయతీ తీర్మానంలో మూడేళ్లకు మాత్రమే గ్రావెల్ క్వారీకి అనుమతిస్తే.. మైనింగ్ శాఖ అధికారులు మాత్రం పంచాయతీ తీర్మానంకంటే రెట్టింపు విస్తీర్ణంలో 30 ఏళ్లకు లీజు అగ్రిమెంట్ ఇచ్చారని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. పైగా క్వారీ యజమానులు జీఎస్టీ చెల్లించకుండా తమిళనాడులో నిర్వహించే రోడ్డు పనులకు గ్రావెల్‌ను ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఆదేశాల్లో ఆరు చక్రాల టిప్పర్ల ద్వారా మాత్రమే గ్రావెల్ తరలించాల్సి ఉండగా, 14, 16 చక్రాల టిప్పర్లలో గ్రావెల్ తరలిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 25వ తేదీలోగా క్వారీకి అనుమతులు రద్దు చేయకుంటే తాము కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సి.రాజేంద్రన్, నాయకులు వాసు నాయుడు, జె.విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ మోహన్, హరిరాజు, సీపీఐ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలొచ్చేవరకు గ్రావెల్ తరలించొద్దని తహసీల్దార్ ఆదేశం

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆందోళనకారులకు తహసీల్దార్ అరుణకుమారి సర్దిచెప్పారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేవరకు గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించొద్దని క్వారీ యజమానులకు ఆమె ఆదేశాలిచ్చారు.





ఆలయం వద్ద భక్తజన సందోహం - సోమవారోత్సవ శోభలో సుబ్రహ్మణ్యస్వామి



వైభవంగా సోమవారోత్సవం

రామకుప్పం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాల్లో భాగంగా నాలుగో సోమవారోత్సవం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున పురోహితులు స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, వెండి కవచధారణతో విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం మయూర వాహనంపై అధిష్టితులైన వళ్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లకు విశేషపూజలు జరిపించారు. ఉదయం ఆరు గంటల నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఆలయ ఈశాన్య దిక్కున గల నాగులపుట్ట వద్ద పూజలు చేసి పాలు, పండ్లు సమర్పించారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతులు రావి, వేప వృక్షాలకు పూజలు చేసి కొమ్మలకు జోలెలు కట్టారు.కళ్లు, చెవుల రుగ్మతలతో బాధపడుతున్న వారు వెండితో చేసిన కళ్లు, చెవులు, సర్పదోషం ఉన్నవారు నాగపడిగలను స్వామి వారి హుండీలో వేసి మొక్కుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని నాగుల ముద్దమ్మ, శనీశ్వరస్వామి, వినాయకాలయం, పద్మావతి, వేంకటేశ్వరస్వామి, బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా భక్తజనంతో కిటకిటలాడాయి. సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి పంబవాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగింపుగా వచ్చిన భక్తులు కుండకావళ్లు, పూలకావళ్లు, నెమలి కావళ్లు, వీపుతేర్లు సమర్పించారు. పలువురు భక్తులు దవడలకు శూలాలు, శరీరాలపై సూదులతో నిమ్మకాయలు గుచ్చుకుని వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు.సీఐ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీనివాసులు, నరేష్ బందోబస్తు నిర్వహించారు.

రేపు విజయవాడకు డీఎస్సీ అభ్యర్థుల పయనం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025లో భాగంగా నియామక పత్రాలు అందుకోవడానికి అభ్యర్థులు బుధవారం విజయవాడకు పయనం కానున్నారు. మెరిట్ ఆధారంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,408 మంది అభ్యర్థులు ఎంపికైన విషయం తెలిసిందే. వీరికి బుధవారం విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌లు ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులతోపాటు సహాయకులను విజయవాడకు ప్రత్యేక బస్సుల్లో పంపడానికి చిత్తూరు-తిరుపతి విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. అభ్యర్థులు బుధవారం ఉదయం ఏడు గంటలకు తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకోవాలని డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కాల్ లెటర్, ఆధార్ కార్డులతో రిపోర్టు చేయాలని సూచించారు. దుప్పటి, దిండు, గొడుగు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. అభ్యర్థులకు, సహాయకులకు ఐడీ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఇందుకోసం ఫొటోలు తీసుకురావాలన్నారు. బస్సు బయల్దేరే ప్రాంగణంలో అల్పాహారం ఏర్పాటు ఉంటుందని వివరిఅంచారు.

డ్యూటీ సిబ్బందిని పట్టించుకోలేదా?

డీఎస్సీ అభ్యర్థులను విజయవాడకు తీసుకెళ్లడానికి డ్యూటీ వేసిన సిబ్బందిని విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలొస్తున్నాయి. ఎంఈవోలు, హెచ్ఎంలు, పీడీ, పీఈటీలు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఈ డ్యూటీ వేశారు. వీరంతా వారి ప్రాంతాల నుంచి సొంత ఖర్చులతో తిరుపతికి చేరుకోవాలి. ఇందుకోసం అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం టీఏ, డీఏ ఇస్తారా? లేదా? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదని సమాచారం.

అంకురార్పణకు అంతా సిద్ధం

తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిఘట్టమైన అంకురార్పణకు సర్వం సిద్ధమైంది. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఉత్సవాలు విజయవంతం కావాలంటూ ఆకాంక్షిస్తూ మంగళవారం నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం మంగళవారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య నిర్వహించే అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు బీజం పడనుంది. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. నవధాన్యాలను మొలకెత్తించి ఈ భూమండలమంతా పాడి పంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనులవారిని ఆలయ నాలుగు మాడవీధుల్లో తొలివాహనంగా ఊరేగిస్తారు. జగద్రక్షకుడైన శ్రీవారికి నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విష్వక్సేనులవారు ఈవిధంగా మాడవీధుల్లో ఊరేగుతారని ప్రాశస్త్యం. మరోవైపు రుత్విక్వరణం కూడా విశేషంగా నిర్వహిస్తారు. అర్చకులకు శ్రీవారే విధులు కేటాయిస్తున్నట్టుగా భావించి ఈ తొమ్మిదిరోజుల పాటు ఎవరు ఏ విధులు నిర్వహించాలో ఈ కార్యక్రమం ద్వారా నిర్ణయిస్తారు. దీనికి సంబంధించి సోమవారం సాయంత్రానికే ప్రణాళిక సిద్ధం చేశారు.



ముస్తాబైన కొండ

బ్రహ్మోత్సవ వైభవం మంగళవారం నుంచి మొదలుకానున్న నేపథ్యంలో తిరుమల క్షేత్రాన్ని విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. శ్రీవారి ఆనందనిలయం నుంచి మహద్వారం వరకు, గోపురం, ప్రాకారం, ఆలయ పరిసర భవనాలు, ముఖ్యకూడళ్లు, రహదారులు, పార్కుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణను సోమవారం రాత్రి మరోసారి పరీక్షించి లోటుపాట్లను సరిచేశారు. దీంతో స్వామి క్షేత్రంలో సోమవారం నుంచే బ్రహ్మోత్సవశోభ కనిపించడం మొదలైంది.

తిరుమలలో మొదలైన సందడి

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ తక్కువగానే ఉన్నప్పటికీ బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు, డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు, శ్రీవారిసేవకులతో తిరుమల అంతా సందడిగా కనిపించింది. బుధవారం సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో తిరుమలలో భద్రతా తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా అధికారులు, పోలీసులు, ప్రత్యేక దళాలు, బాంబ్, గాడ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేశాయి. సోమవారం రాత్రి చిరుజల్లులు పడటంతో ఉత్సవాలకు స్వామే క్షేత్రాన్ని శుభ్రపరుస్తున్నారని కొందరు భక్తులు వ్యాఖ్యానించారు.

ధ్వజారోహణానికి చెల్లూరు దర్భ



తిరుమల, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): ధ్వజారోహణానికి వినియోగించే దర్భ చాప, తాడు ఊరేగింపుగా సోమవారం తిరుమల ఆలయానికి చేరాయి. టీటీడీ అటవీ విభాగం దర్భను సేకరించింది. టీటీడీ ఫారెస్ట్ డిపోలో అంతకుముందు వీటికి నిర్వహించిన పూజలో డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఆర్వోలు పాల్గొన్నారు. రంగనాయక మండపంలో శేష వాహనంపై వీటిని ఉంచారు. బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీనలగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు.

తిరుమలలో వాడేది విష్ణుదర్భ

దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపైవరకు చుడతారు. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అని రెండు రకాలుంటాయి. తిరుమలలో విష్ణు దర్భనే వినియోగిస్తారు. ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో విష్ణుదర్భను టీటీడీ అటవీశాఖ సేకరిస్తుంది. వారం రోజుల పాటు ఎండబెట్టి శుభ్రపరుస్తారు. 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో 60 కిలోల బరువైన దర్భ చాపను అల్లుతారు. 255 మీటర్ల పొడవైన 106 కిలోల తాడును పేనుతారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గ్రంథాలయ వ్యవస్థకు మంచిరోజులు

రామకుప్పం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థకు మంచిరోజులు రానున్నాయని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ పాలనలో గ్రంథాలయ వ్యవస్థను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు గ్రంథాలయ వ్యవస్థ బాగు కోసం చర్యలు చేపడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో గ్రంథాలయ వ్యవస్థ బాగు కోసం శోభా డెవలపర్స్ వారు రూ.100కోట్లు అందించారని వెల్లడించారు. అన్ని నియోజకవర్గాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడమే కాకుండా, కొత్త జిల్లా కేంద్రాల్లో జిల్లా గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నాయని వివరించారు. అదేవిధంగా డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు. గ్రామీణులకు సౌకర్యంగా గ్రామసచివాలయాల్లో రీడింగ్ రూమ్‌లు ఏర్పాటవుతాయన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు



కుప్పం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా శైవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గుడుపల్లె మండలం దాసిమానుపల్లెలో వెలసిన సోమేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పుష్పాలంకరణలు చేశారు. విశేష పూజలు చేశారు. దాసిమానుపల్లెతోపాటు పరిసర గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి



ఇంజనీర్లతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడా తాగు నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని పుంగనూరు నియోజక వర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం రొంపిచెర్లలో సదుం, పుంగనూరు డీఈలు, ఏఈలతో తాగునీటి పథకాలు, మోటర్ల సమస్యలపై సమీక్షించారు. డీఈలు సురేష్‌రెడ్డి, కిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకొంటామని, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు వచ్చే ఏడాది మార్చి కల్లా పూర్తిచేయించి పైపులైన్ కనెక్షన్‌లు ఇచ్చేందు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా సమస్య ఉంటే తన దృష్టికి తెస్తే కలెక్టరుతో చర్చించి పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రొంపిచెర్ల ఏఈ వేణు, సదుం ఏఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే బలమైన కుటుంబం

కల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే వారి కుటుంబం, సమాజం బాగుంటుందని వైద్యాధికారులు యల్లయ్య, రమ్యశ్రీ, టీడీపీ సీనియర్ నాయకులు ధనంజయనాయుడు, లోకేష్, చెంగల్రాయనాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లిలో సోమవారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ వైద్య శిబిరంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, క్యాన్సర్, క్షయ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. సర్పంచ్ సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రమేష్, టీడీపీ నాయకులు పురుషోత్తంనాయుడు, ప్రభాకర్‌నాయుడు, మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చౌడేపల్లె, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఏసీడీపీవో సుజాత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్దకొండామారి విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద అంగన్వాడీ కార్యకర్తలతో కలసి పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబరు 16 వరకు పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6 నెలలు శిశువు నుంచి 6 ఏళ్ల బిడ్డవరకు పౌష్టికాహరాన్ని అంగన్వాడి కేంద్రాల ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధ, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శరన్నవరాత్రి పూజలు



ఆనిగానురుల్లో పసుపు అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

రామకుప్పం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రామకుప్పంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ, కాశీవిశ్వేశ్వరాలయం, ఆనిగానూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ, కంబాలదేవులపల్లె సప్తమాతృకా చౌడేశ్వరమ్మ ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకపూజలు చేసి విశేష అలంకరణలు చేశారు. సాయంత్రం రామకుప్పం, ఆనిగానూరుల్లోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవార్లు పసుపు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కంబాలదేవులపల్లె చౌడేశ్వరమ్మ ఆలయంలో సప్తమాతృకలకు లక్ష్మీకుంకుమ అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు.

కందూరు పాలేటమ్మకు ప్రత్యేకపూజలు



సోమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరులో కొలువుదీరిన పాలేటమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేష అలం కరణ చేశారు. అమ్మవారికి పుట్టినింటి సంప్రదాయాలతో కామిరెడ్డివారిపల్లె ఎల్‌కేటీ రాజారెడ్డి కుటుంబ సభ్యులు సారె, చీర సమర్పించి అభిషేకపూజలు జరిపారు.

సోమల ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

సోమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమల ఎంపీడీవోగా జీవీఎస్‌వీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా సంగం మండలం లో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ప్రసాద్ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

సోమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీతో అందజేస్తున్న సహకార రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యులు పొదుపు పథకాలను అలవాటు చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ సమావేశంలో సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులునాయుడు, సభ్యులు అష్రఫ్ వల్లీ, సతీశ్, సీఈవో రెడ్డెప్ప, మల్లికార్జున, చాణిక్య, వెంకటరత్నం, మణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంభేశ్వరుడికి అభిషేకపూజలు




సోమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సోమలలో కొలువుదీరిన స్వయంభేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అర్చకులు స్వామివారికి విశేష పుష్పాలంకరణ చేసి అభిషేకపూజలు, అర్చనలు నిర్వహించారు. ఉభయదారులు శెట్టివారి మోహన్, సావిత్రి దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే దుర్గం కొండలో కొలువుదీరిన గార్గేయ మునీశ్వర స్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

నేడు బోయకొండ గంగమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ

రొంపిచెర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండగంగమ్మకు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు ఆయన రొంపిచెర్లలో సోమవారం తెలిపారు.

బాలా త్రిపురసుందరిగా వైష్ణవిదేవి



చౌడేపల్లె, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవం సందర్భంగా పుదిపట్లలో కొలువైన వైష్ణవిదేవి బాలాత్రిపుర సుందరీ దేవిగా దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చోరీకేసులో నిందితుడి అరెస్టు

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె నుంచి లక్కనపల్లె వెళ్లే రహదారిలో ఉన్న భానుమతికి చెందిన గుజరీ దుకాణం చోరీకేసులో నిందితుడైన కోలార్‌కు చెందిన తన్వీర్‌బాషాను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.1 లక్ష 50వేలు విలువైన సొత్తును స్వాధీనం చేసున్నారు. అతడిని రిమాండుకు తరలించినట్లు పలమనేరు రూరల్ సీఐ పరశురాముడు తెలిపారు.

శరన్నవరాత్రులు ప్రారంభం

సదుం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అమ్మవారి శరన్నవరాత్రులు సోమవారం ప్రారంభమయ్యాయి. సదుం గంగమ్మ, కన్యకా పరమేశ్వరి, రామలింగ చౌడేశ్వరి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అలాగే పచ్చార్లమాకులపల్లెలో వెలసిన గంగాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గుండెపోటుతో వైసీపీ నేత మృతి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం చదళ్లకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు విజయ భాస్కర్‌రెడ్డి ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. సోమవారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ ఎన్. రెడ్డెప్ప, ఎంపీపీ భాస్కర్ రెడ్డి, పలువురు నివాళులర్పించారు.

సస్యశ్యామలం చేయడమే సీఎం సంకల్పం

శాంతిపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కుప్పంలో ప్రతి ఎకరాకు నీటిని అందించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని టీడీపీ శాంతిపురం మండలాధ్యక్షుడు నందిగం ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సి.బండపల్లె నుండి చెంగబల్ల వరకు హంద్రీ-నీవా కాలువ నుంచి చెరువులకు చేపడుతున్న సప్లయ్ చానల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు ప్రాంతమైన కుప్పంను కృష్ణామ్మ జలాలతో చంద్రబాబు సస్యశ్యామలం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పీవీ.నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ రాజేంద్ర, నేతలు, చంద్రశేఖర్, విజయ రాయిరెడ్డి, మణి, గిరి బసవరాజు, అనుసూయ, చలపతి, హరినాథ్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



కర్లగట్ట బాపని చెరువును పరిశీలిస్తున్న ఉదయ్‌కుమార్ ఇతర టీడీపీ నేతలు

దసరా ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు



మత్స్యావతారంలో కళ్యాణవెంకటరమణస్వామి, ప్రత్యేకాలంకరణలో అన్నపూర్ణాదేవి



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న పుంగనూరు విరూపాక్షి మారెమ్మ ఆలయం

పుంగనూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలకు పుంగనూరు ఆలయాలు ముస్తాబయ్యాయి. కొన్ని క్షేత్రాల్లో సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకాగా కొన్ని ఆలయాల్లో మంగళవారం నుంచి శాస్త్రోక్తంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పుంగనూరు కోనేరు వద్ద వెలసిన టీటీడీ ఆధీనంలో ఉన్న కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం ఉదయం అష్టలక్ష్మి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. అద్దాల మండపంలో వెంకటరమణుడు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆస్థానమండపంలో ప్రత్యేకంగా బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ● స్థానిక బజారువీధిలో వెలసిన వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో సుప్రభాతం, నవగ్రహ ఆరాధన, అభిషేకాలు, మూలవర్లకు బంగారుకవచం అలంకరణ, ఉత్సవవిగ్రహానికి గాజుల అలంకరణలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కె.బాలసుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య మహిళమండలి, సంఘ నాయకులు పాల్గొన్నారు. ● స్థానిక నగరిలో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రసన్నపార్వతీదేవికి, కోనేరు వద్ద వెలసిన అన్నపూర్ణాదేవికి, తూర్పుమొగసాలలోని చాముండేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి ఉత్సవాలు

పుంగనూరు బస్టాండ్ సమీపంలో వెలసిన సుగుటూరు గంగమ్మ సోదరి శక్తిస్వరూపిణి విరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం స్వర్ణకవచ బాలంకృత అలంకారంతో దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

దోభి ఘాట్ సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతి అందజేస్తున్న రజకులు

రొంపిచెర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల గ్రామం నగిరి మడుగువారిపల్లె వద్ద ఉన్న దోభిఘాట్ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, తహసీల్దార్ అమరనాథ్‌కు వేర్వేరుగా సోమవారం రజక సంఘం నాయకులు వినతులు ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.వెంకటరమణ మాట్లాడుతూ సర్వేనెంబరు 1041లో 0.40 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం దోబీఘాట్‌కు ఇచ్చిందన్నారు. దీనిలో కొందరు దిబ్బలు, గడ్డివాములు, పశువుల దొడ్లు వేసుకొన్నారని వాటిని తొలగించాలని కోరారు. గతంలో దోబీఘాట్‌లో అమర్చిన నీటి తొట్టెలు, బండలు, పైపులు పాడైపోయాయన్నారు. విద్యుత్ మోటారు ఏర్పాటు చేయాలని, చుట్టు కంచె వేయించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకట్రమణ, గురప్ప, ప్రతాప్, హరిబాబు, నిర్మల, జయప్రకాస్, అనరాధ, నాగభూషణం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

30లోపు జాబ్‌కార్డుల ఈకేవైసీ పూర్తిచేయాలి

కల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని ఉపాధి శ్రామికులకు ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేయాలని ఏపీవో సౌభాగ్యవతి తెలిపారు. పులిచెర్ల ఉపాధి కార్యాలయంలో సోమవారం క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడువు తేదీలోపు క్షేత్రసహాయకులు ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు.

మహిళ ఆరోగ్యం ఇంటికి వెలుగు

రొంపిచెర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆకుటుంబ సభ్యులకు ఏకష్టం వచ్చినా చూసుకొంటారని వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. సోమవారం రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య బృందంతో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో వైద్యపరీక్షలు, చికిత్సలు 200 మందికి చేశారు. క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భాశయ సమస్యలు, బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. ఈకార్యక్రమంలో కంటి డాక్టరు ప్రసాద్‌రాజు, గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టరు పుష్పకుమారి, చిన్నపిల్లల వైద్యనిపుణులు షఫీ, దంత వైద్య నిపుణులు డాక్టరు అజితా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీషా, హెచ్ఈ రాజేశ్వరి, హెచ్ఎస్ పంకజ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

హిమశైలపుత్రి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



అమ్మవారి ఆలయానికి గంగను తీసుకొస్తున్న ఆర్యవైశ్యులు

కల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు బజారువీధిలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు హిమశైలపుత్రి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గంగస్వీకరణ, ఋత్విక కంకణం, వేదపారాయణం, అభిషేకం, సహస్ర నామార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. రాత్రి కన్యకాపరమేశ్వరి అమ్మవారు హిమశైలపుత్రి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా రెడెప్పశెట్టి, వెంకటసుబ్బారావు, రంగయ్యశెట్టి, చిన్నయర్రయ్యశెట్టి, పాపయ్యశెట్టి, నాగరాజుశెట్టి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఈ వేడుకలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయండి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్

సోమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం పెద్దఉప్పరపల్లె ప్రభుత్వ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యసేవలు, సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరాతీశారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత, ఇటీవల కురుస్తున్న వర్షాలతో వచ్చే వ్యాధులు వాటి నివారణ చర్యలపై సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలన్నారు. డాక్టర్ బాలాజీ, ఆరోగ్య విస్తరణాధికారి ఉదయభాస్కర్, సూపర్ వైజర్ చంద్రమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఆనందబాబు

శాంతిపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో పోడురూ వద్ద సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాళ్లబూదుగురు ఎస్ఐ నరేష్ కథనం మేరకు.. కుప్పానికి చెందిన ఆనంద్‌బాబు స్కూటీలో శాంతిపురానికి బయలుదేరాడు. పోడూరు వద్ద వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ఢీకొంది. ఆనందబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను 108సాయంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆయన్ను పరిశీలించి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణకవచ అలంకరణలో బాటగంగమ్మ



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె బాటగంగమ్మ ఆలయంలో సోమవారం దసరా నవరాత్రి ప్రత్యేకపూజల్లో భాగంగా అమ్మవారు స్వర్ణకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు నాగేంద్రప్రసాద్ అమ్మవారికి అభిషేకంచేసి విశేషాలంకరణతో ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక సల్లాపురెమ్మ ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని గడ్దూరు గ్రామంలో వెలసిన సల్లాపురెమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు రవిశంకర్ అమ్మవారికి ప్రత్యేకపూజలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బేలుపల్లెలో వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలుపల్లె గ్రామంలో స్వస్తనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యసిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ సంద ర్భంగా ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య విద్యాధికారి సావిత్రి అవగాహన కల్పించారు. పలువురికి వైద్యపరీక్షలు జరిపి మందులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ఊరట



పుంగనూరు రూరల్: జీఎస్టీ సంస్కరణల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట లభించినట్లు పుంగనూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఎం.జగదీశ్‌రాజు అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు బీజేపీనాయకులు పాలాభిషేకం చేశారు. బీజేపీ నాయకులు పెద్దమఠం బాబు, నానబాల కుమార్, మల్లికారాణి, ప్రసాద్, చంద్రశేఖర్‌రాజు, వెంకటరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నాగరాజ, నారాయణ, దివాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా మొదలైన దసరా ఉత్సవాలు

బాలా త్రిపుర సుందరిగా దుర్గమ్మ



వి.కోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వి.కోట కొలువైన దుర్గమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్ని వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారికి విజయ కుమార్‌రాజు కుటుంబ సభ్యులు అంబళితో పాటు ఇతర పూజా సామగ్రిని తీసుకువచ్చి తొలి పూజలకు అంకురార్పణ చేశారు. ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పలు హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆపై పలు రకాల అభిషేకాలు నిర్వహించి, మహా మంగళహారతులు సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రికి దుర్గమ్మ వారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు, మహిళలు తరలివచ్చి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఇల్లు కూల్చేశారని మహిళ ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణెమ్మ

గంగవరం, సెప్టెంబరు22 (ఆంధ్ర జ్యోతి): దశాబ్దాలుగా కాపురమున్న షెడ్డును కళ్ల ముందే కూల్చేయడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన గంగవరం మండలంలో సోమవారం చోటుచేసుకొంది. బాధితుల కథనం మేరకు.. బూడిదపల్లెకు చెందిన నరసిం హులు భార్య మణెమ్మ గ్రామంలో టెంకాయ ఆకులతో పాక వేసుకొంది. ఇటీవల వర్షాలకు అది కూలి పోయింది. దీంతో ఆ స్థలంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొంది. ప్రభుత్వ స్థలంలో షెడ్డు నిర్మించిందని కొంత మంది గ్రామ స్తులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు సోమ వారం రెవిన్యూ అధికారులు, పోలీసుల సాయంతో షెడ్డును కూల్చివేశారు. ఆవేదన చెందిన మణెమ్మ పురుగుల మందు తాగేసింది. అధికారులు, స్థాని కులు ఆమెను వెంటనే పలమ నేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం పై గంగవరం తహశీల్దార్ రేఖను వివరణ కోరగా అది ప్రభుత్వ భూమి అని తెలియజేశారు. అయినా బాధితురాలికి ప్రత్యామ్నాయంగా స్థలం ఇస్తామని ఖాళీచేయాలని చెప్పినా వినకపోవడంతో షెడ్డును తొలగించామని వివరించారు.

రాళ్లగంగమాంబ ఆలయంలో నవరాత్రులు ప్రారంభం



కవచ అలంకరణలో రాళ్లగంగమాంబ

శాంతి పురం, సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని ప్రసన్న రాళ్లగంగమాంబ దేవాలయంలో సోమ వారం నవ రాత్రి ఉత్స వాలు ప్రారంభ మయ్యాయి. ఆలయ అర్చకులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ఆవరణలో హోమాలు నిర్వహించి అమ్మవారికి కవచ అలంకరణ చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భూ సమస్యను పరిష్కరించకుంటే
ఆత్మహత్యే శరణ్యం

● కలెక్టరేట్‌కు పెట్రోల్ క్యాన్‌తో వచ్చిన ఓ కుటుంబం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ భూ సమస్యను పరిష్కరించకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ ఓ కుటుంబం పెట్రోల్ క్యాన్‌తో కలెక్టరేట్‌కు వచ్చి ఆవేదన వ్యక్తం చేసింది. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపంజాణి మండలం కోగిలేరు పంచాయతీలోని పుట్టగాని పల్లెకు చెందిన ఓ కుటుంబం పెట్రోల్ క్యాన్ తీసుకుని కలెక్టరేట్‌కు వచ్చింది. కుటుంబ పెద్ద నరేష్ మాట్లాడుతూ.. తమ కుటుంబానికి చెందిన ఉమ్మడి ఆస్తికి భాగపరిష్కారం ఇంకా కాలేదని, పైగా కోర్టులో కేసు నడుస్తోందని చెప్పారు. ఈ సమయంలో గ్రామంలోని ఓ భూస్వామి తమ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నాడని వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని చెబుతూ.. క్యాన్‌లోని పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేయగా గమనించిన ఒకటో పట్టణ సీఐ మహేశ్వర, రెండో పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు అప్రమత్తమయ్యారు. వారిని వారించి, కలెక్టర్ సుమిత్‌కుమార్ వద్దకు తీసుకెళ్లారు. వారం పది రోజుల్లో న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో వెనుతిరిగారు. బాధితుల నుంచి అర్జీలను కలెక్టరేట్‌తోపాటు జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, పలువురు అధికారులు స్వీకరించారు.


నరేష్ వద్ద పెట్రోల్ క్యాన్‌ను లాక్కొంటున్న సీఐ మహేశ్వర


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలు 348

కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 348 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూకు 261, డీఆర్‌డీఏకు 24, పోలీసుశాఖకు 7, పంచాయతీరాజ్‌శాఖకు 7, పశు సంవర్ధకశాఖకు 5, విద్యాశాఖకు 4, ఇరిగేషన్‌కు 3 రాగా, ఉద్యానశాఖ, నేషనల్‌హైవే, గృహ నిర్మాణశాఖ, హయ్యర్ ఎడ్యుకేషన్, ఆర్ అండ్‌బీ, ఎస్సీ వెల్ఫేర్, మునిసిపాలిటీ శాఖలకు 37 అర్జీల చొప్పున ఉన్నాయి.

అబ్బగుండు గ్రామానికి తారురోడ్డు వేయండి

తరతరాలుగా నివాసముంటున్న ఐరాల మండలం అబ్బగుండు గ్రామానికి తారు రోడ్డు వేయాలని గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు పీజీఆర్ఎస్‌లో పలు మార్లు అర్జీలను ఇచ్చామన్నారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యుత్ శాఖ ఉద్యోగుల ధర్నా



తమ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నేతలు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విధినిర్వహణలో ప్రమాదాలు జరిగితే అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీ ద్వారా వైద్య సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగిని తమ శాఖలోకి విలీనం చేయాలన్నారు. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు.

మేత బయలు భూమిని కాపాడండి

మూగ జీవాలను మేపుకుంటున్న మేత బయలు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వెదురుకుప్పం మండలం పిళ్లారికుప్పం పంచాయతీలోని ముల్లూరు ఎస్టీ కాలనీ వాసులు కోరారు. సర్వే నెంబరు 365లో మేత బయలు భూములు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ భూముల్లోని కొంత భాగాన్ని ఓవ్యక్తి చదును చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. అతడి బారినుంచి మేత బయలు భూమిని కాపాడాలని విన్నవించారు.

పోలీసుశాఖకు 53 అర్జీలు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 53 అర్జీలు వచ్చాయని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. వచ్చిన అర్జీల్లో.. భూ తగాదాలపై 23, డబ్బు తగాదాలపై 10, కుటుంబ తగాదాలపై 8, వేధింపులపై 6, ఆస్తి తగాదాలపై 3, చీటింగ్‌పై 2, దొంగతనంపై ఒకటి చొప్పున ఉన్నాయి.

సంతృప్తికరంగా వాహనసేవల వీక్షణ

● తిరుమల మాడవీధుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఆంధ్రజ్యోతి



'తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరే భక్తులకు సంతృప్తికర వాహనసేవల దర్శనం కల్పించేలా పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాం. నిర్దేశించిన సమయానికి వాహనసేవలు నిర్వహించేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించాం. చిన్నపాటి సమస్యకు కూడా అవకాశమివ్వకుండా సూక్ష్మస్థాయిలో ప్లాన్‌ను సిద్ధం చేశాం. తిరుమలకు చేరుకుని గ్యాలరీల్లోకి రావడమే భక్తుల వంతు. మిగిలినదంతా మేమేం చూసుకుంటాం' అని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చెప్పారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్ల వివరాలు ఆయన మాటల్లోనే..

సాంకేతిక సాయంతో రద్దీ నియంత్రణ

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి క్రౌడ్ మేనేజ్మెంట్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. టీటీడీ చరిత్రలో తొలిసారిగా ఇస్రో సేవలను ఉపయోగించుకోబోతున్నాం. అలాగే భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ఈసారి ఎల్‌అండ్‌టీ కూడా తమ సహకారం ఇవ్వబోతోంది. ఎంతమంది తిరుమలకు చేరినా ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశాం.

పక్కా ప్రణాళిక

ఈ తొమ్మిదిరోజుల ఉత్సవాలను ఎలా నిర్వహించాలనే అంశంపై ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి పక్కా ప్రణాళికలతో సూచనలు చేశాం. ముందస్తుగా తయారు చేసిన ప్లాన్ ప్రకారమే అన్నిటినీ అమలు చేయబోతున్నాం.

గట్టి భద్రత

4,700 మంది పోలీసులు, 2 వేల మంది విజిలెన్స్, వెయ్యిమంది టీటీడీ ఉద్యోగులు, 3,500 మంది శ్రీవారిసేవకులు, 2,100 మంది పారిశుద్ధ్య కార్మికులు ఇలా పదివేల మందికిపైగా భక్తులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

గరుడసేవపై ప్రత్యేక దృష్టి

ప్రధానంగా గరుడసేవకు ఎలాంటి సమస్యల ఉత్పన్నం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. గ్యారీల్లోకి చేరే భక్తులే కాకుండా వెలుపల ఉండే యాత్రికులకూ ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశంపై దిశా నిర్దేశం చేశాం. సరైనా కోఆర్డినేషన్‌తో స్వామి ఉత్సవాలను సక్సెస్ చేస్తాం.

దొంగతనం కేసులో ఐదుగురికి జైలు, జరిమానా


జైలు శిక్ష పడిన ఐదుగురి నిందితులతో కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు

కల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులోని కరీముల్లా బంగారు, వెండి నగలు దుకాణంలో చోరీ కేసులో ఐదుగురి నిందితులకు 6 నెలలు జైలు శిక్షతో పాటూ ఒక్కొక్కరికి రూ: 500 జరిమానా విధించారు. కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. 2019 సంవత్సరంలో కరీముల్లా నగల దుకాణంలో 1500 గ్రాముల వెండి నగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. అప్పటి ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం బోయపల్లికి చెందిన ఆర్.అరుణ, డి.గీత, వి.ప్రభావతి, పి .విజయకుమారి, ఆర్.మణిగా గుర్తించి వారిని అరెస్టు చేశారు. పాకాల కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పాకాల కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమాదేవి సోమవారం ఐదుగురి నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

పీఈఎస్‌లో చిన్నారికి కొత్త జీవితం

కుప్పం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో అతిక్లిష్టమైన న్యూరో సర్జరీ చేసి ఎనిమిదేళ్ల చిన్నారిని మరణం నుంచి కాపాడి కొత్త జీవితం ప్రసాదించినట్లు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. యాజమాన్యం కథనం మేరకు.. తమిళనాడుకు చెందిన ఎనిమిదేళ్ల బాలికను ఆమె తల్లిదండ్రులు చికిత్సకోసం కుప్పంలోని పీఈఎస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి సుమారు అయిదు నెలల క్రితం తీసుకొచ్చారు. చిన్నారి కింద పడి మెదడులో చిన్న గాయం మాత్రమే ఉందని వారు భావించారు. కానీ ఆమె పరిస్థితి మరింత దిగజారి చేతులు, కాళ్లల్లో బలం కోల్పోసాగింది. చివరికి నాలుగు అవయవాలలో క్వాడ్రిపరేషన్ పక్షవాతం వచ్చింది. నడవలేని స్థితికి చేరింది. ఆస్పత్రి న్యూరో విభాగాన్ని సంప్రదించినప్పుడు వైద్యులు పరిశీలించి, చిన్నారికి శాశ్వత పక్షవాతం వచ్చే ప్రమాదముందని గ్రహించారు. జీవించే అవకాశం తక్కువని గుర్తించారు. సీటీ, ఎమ్మార్ఐ స్కాన్ చేసిన తర్వాత ఆమెకు పోస్ట్ ట్రామాటిక్ యాకిల్ డిస్ లోకేషన్ (ఏఏడీ) అనే పరిస్థితి వచ్చిందని నిర్ధారించారు. డాక్టర్ మయూర్ వి.కాకు బృందం చిన్నారికి ఫిక్సేషన్ ఫ్యూజన్ నిర్వహించారు. అధునాతన ఇంట్రాపరేటివ్ ఇమేజింగ్ ఉపయోగించి వెన్నెముకను జాగ్రత్తగా ఇంప్లాంట్‌తో పునరుద్ధరించారు. అతి కష్టతరమైన ఈ శస్త్ర చికిత్సతో అవయవ బలహీనతలు తగ్గి చిన్నారి కోలుకుంది. డిశ్చార్జి సమయానికి ఆమె నడవ గలిగింది. కష్టతరమైన న్యూరో శస్త్ర చికిత్స విజయంతంగా చేసిన డాక్టర్ మయూర్ వి.కాకు బృందాన్ని పీఈఎస్ ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా జడ్జి అరుణసారికను ఎస్పీ తుషార్ డూడి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కోర్టు కార్యాలయంలోని జడ్జి చాంబర్‌లో ఆమెను కలిసి మొక్కను బహూకరించారు.

రూ.157 కోట్ల మామిడి సబ్సిడీ త్వరలో విడుదల

● కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి రైతులకు సబ్సిడీ రూపంలో చెల్లించాల్సిన రూ.157 కోట్లను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి అధికారులతో ప్రత్యక్షంగా, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆదివారం వరకు జిల్లాలో 63,063 వినతుల స్వీకరణ జరిగిందన్నారు. అధికారులు రోజూ అందిన అర్జీలను పరిశీలించారో లేదో సమీక్షించాలన్నారు. జిల్లా అధికారులందరూ ఇకపై ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఈ-ఆఫీస్ ద్వారా ఫైల్స్ నిర్వహించాలన్నారు. స్వామిత్వ పథకం గురించి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అభివృద్ధి ప్రాంతాలు, ఇండ్లు, స్థలాలపై హక్కుదారులను స్పష్టంగా గుర్తించాలని చెప్పారు.జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినూత్నంగా చెత్తసేకరణ



పూతలపట్టు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):పూతలపట్టు మండలం తేనేపల్లి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పట్టాభి చెత్తసేకరణ పనిని వినూత్నంగా చేస్తున్నాడు. ఆకనంబట్టు గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు పట్టాభి తేనేపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో చెత్త సేకరిస్తుంటాడు.రూ.18వేల ఖర్చుతో ఓ ట్రాలీని ఏర్పాటు చేసుకుని దాన్ని తన ద్విచక్రవాహనానికి తగిలించుకుని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి చెత్త సేకరిస్తున్నాడు.దాన్ని ట్రాలీలో నింపి తరలిస్తున్నాడు.

నిండిన కౌండిన్య రిజర్వాయర్

● నీట మునిగిన పంటలు
● ముంపు రైతులను ఆదుకోవాలి
● రైతు సంఘ నాయకులు

పలమనేరు, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన కౌండిన్య రిజర్వాయర్ నిండిందని ఇక తాగునీటి సరఫరా కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదని మున్సిపల్ అధికారులు భావిస్తుండగా రిజర్వాయర్ నిండి తాము సాగుచేసిన పంటలు మునిగిపోయాయని రైతులు లబోదిబో అంటున్నారు. అప్పట్లో పలమనేరుకు 10 కిలోమీటర్ల దూరంలో కాలువపల్లి సమీపంలో కౌండిన్య రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ నిండితే రిజర్వాయర్ సమీపంలో ఉన్న కొంత మంది భూములు మాత్రమే ముంపునకు గురవుతాయని కొందరికి మాత్రమే ఆరోజుల్లో ముంపు నష్టపరిహారం చెల్లించారు. మరి కొందరికి చెల్లించలేదు. మూడేళ్లుగా రిజర్వాయర్ నిండక పోవడంతో కాలువపల్లి గ్రామానికి చెందిన రైతులు పంటలను సాగుచేసుకొంటూ వస్తున్నారు. ఇప్పుడు రిజర్వాయర్ నిండటంతో రిజార్వాయర్ సమీపంలోని పొలాల్లో కాలువపల్లి గ్రామానికి చెందిన రైతులు సాగు చేసిన వరి పంటలు నీట మునిగి పోయాయి. కాలువపల్లి గ్రామానికి చెందిన మునిరత్నం, లోకనాథం, రాజమ్మ, జయరామయ్య, ఉమాపతి అనే రైతులు సాగు చేసిన వరి పొలాలు నీట మునిగి పోయాయి. పంటలు నీట మునిగిన విషయం తెలుసుకొన్న జిల్లా రైతు సంఘం నాయకులు ఉమాపతి నాయుడు సోమవారం నీట మునిగిన రైతుల వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ముంపు నష్టపరిహారం చెల్లించని రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే రైతులు తమభూములు మునగకుండా ఎత్తు పెంచుకొనేందుకు అయ్యే వ్యయాన్ని భరించాలని కోరారు.


పలమనేరు సమీపంలో నిండిన రిజర్వాయర్‌తో మునిగిన పంటలు



కాలువపల్లి వద్ద పంట మునిగిన రైతులు లోకనాథం, ఉమాపతి

పంటలపై కొనసాగుతున్న గజరాజుల దాడులు

కల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజరాజుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం, చల్లావారిపల్లి పంచాయతీల్లో ఆదివారం రాత్రి వరి, కొబ్బరి, మామిడి, టమోటా పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా మూడు గ్రూపులుగా విడిపోయిన 16 ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తూ పగలంతా తూర్పు, పశ్చిమ విభాగం అటవీ ప్రాంతాల్లో తిష్ట వేశాయి. ఆదివారం రాత్రి చీకటి పడే సమయానికి తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి బయల్దేరిన 5 ఏనుగుల గుంపు పాళెం పంచాయతీ కోటపల్లి వద్దకు చేరుకున్నాయి. రైతులు నరేష్, రఘు, వెంకట్రమణ, వెంకటముని, హరినాయుడుకు చెందిన మామిడి పంటను ధ్వంసం చేసిన ఏనుగులు పశుగ్రాసం తినేశాయి. అక్కడి నుంచి కల్లూరు సమీపానికి చేరుకున్న ఏనుగులు రైతులు సుబ్బరాజు, అఫ్సర్, షామీర్‌కు చెందిన కొబ్బరి, మామిడిచెట్లను ధ్వంసం చేసి కర్నూలు-చిత్తూరు హైవేను దాటుకున్నాయి. రైతులు శ్రీరాములు, ఖాదర్‌బాషాకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసి తలారివారిపల్లి, పాతపేటవద్దకు చేరాయి. ఇదే సమయానికి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి ఇక్కడికి చేరుకున్న 9 ఏనుగుల గుంపు 5 ఏనుగుల గుంపుతో కలుసుకొని చల్లావారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు దామోదర్‌నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, బాలు, సుబ్రమణ్యానికి చెందిన టమోటా, వరి పంటలను ధ్వంసంచేశాయి. అక్కడి నుంచి అమ్మచెరువు మీదుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక వద్దకు చేరుకున్నాయి. జంట ఏనుగులు మాత్రం పంటల వైపు రాకుండా రాత్రంతా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. సోమవారం పగలంతా 14 ఏనుగులు పశ్చిమ విభాగం అడవిలో, జంట ఏనుగులు తూర్పు విభాగం అడవిలో తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట, మామిడిచెట్లు

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

● ఎమ్మెల్యే జగన్మోహన్



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో కొందరు గుజ్జు పరిశ్రమల యజమానులు తోతాపురి మామిడికి ప్రభుత్వం నిర్ణయించిన కిలో రూ.8 ఇవ్వడంలేదని ఎమ్మెల్యే తన దృష్టికి తెచ్చారని చెప్పారు. ఈ విషయంపై గుజ్జు పరిశ్రమల యజమానులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లాలో మామిడి పంట విపరీతంగా పండిందని, తోతాపురి రకం కొనేవారు లేకపోవడంతో సీఎం స్పందించి మంత్రులను, అధికారులను గుజ్జు పరిశ్రమల యజమానులతో మాట్లాడించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తోతాపురికి కిలో రూ.4 రాయితీ ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. మామిడి రైతుల కోసం రూ.216 కోట్లు వ్యయం చేశామని చెప్పారు.

జీఎస్టీ తగ్గింపుతో మధ్యతరగతికి ఉపశమనం

కుప్పం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీని రెండు శ్లాబులకే పమిరిమితం చేయడమనేది మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్య అని కుప్పం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్.ఎస్. తులసీనాథ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసిన జీఎస్టీ శ్లాబులు అమల్లోకి వచ్చిన సందర్భంగా కుప్పంలో ఆయన ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. స్థానికక ఆర్టీసీ బస్టాండు కూడలిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణాసంచా పేల్చి సంబరాలు పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా తులసీనాథ్ మాట్లాడుతూ సమర్థురాలైన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సామర్థ్యానికి ఇది నిదర్శమన్నారు. నిత్యావసరాలతోపాటు ఎలక్ట్రానిక్స్ గూడ్స్, వంటింటి సామాన్ల ధరలు గణనీయంగా తగ్గి పేద, మధ్య తరగతికి మేలు చేకూరుతుందని చెప్పారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, టీటీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, రెస్కో డైరెక్టర్ అమీర్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు ఉదయకుమార్, ఏఎంసీ డైరెక్టర్ వడివేలు తదితరులు పాల్గొన్నారు.


కుప్పంలో ప్రధాని మోదీకి పాలాభిషేకం చేస్తున్న తులసీనాథ్ తదితరులు

పీకేఎం వుడా చైర్మన్‌గా సురేష్‌బాబు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



కుప్పం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం వుడా) చైర్మన్‌గా డాక్టర్ బి.ఆర్.సురేష్ బాబును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్ల కాల వ్యవధితో ఆయనను ఈ పదవిలో నియమించారు. ఈ మేరకు నియామకానికి సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు.పలమనేరు, కుప్పం,మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు పూర్తిగా, పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలు పీకేఎం వుడా పరిధిలోకి వస్తాయి.

సహిత విద్య టీచర్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన


జిల్లా ఎస్ఎస్ కార్యాలయం ముందు టీచర్లు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సహిత విద్య సెంటర్లలో పనిచేస్తున్న టీచర్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలనను సమగ్రశిక్ష (ఎస్ఎస్) కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. జిల్లాలో 31 సహిత విద్య కేంద్రాలుండగా, 62 టీచర్లు పనిచేస్తున్నారు. వీరి సర్వీసుతోపాటు సహిత విద్యకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పరిశీలన ప్రక్రియను ఏపీసీ వెంకటరమణ చేపట్టారు. ఐఈఆర్‌టీ మధు, సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



నింద్ర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూనమరాజుపాళెంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధ్వజారోహణాన్ని వైభవంగా నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో గీతా మందిర ఆశ్రమ పీఠాధిపతి పుండరీక వరదానందస్వామి పాల్గొన్నారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు రూపేష్ కృష్ణ ఆచార్య తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో హరికథ, అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. ఆలయ ధర్మకర్త మునిరత్నం ఆచారి కుటుంబీకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీ హోమం


దుర్గాంబకు గ్రామోత్సవం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో సోమవారం అమ్మవారికి ఈవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో మహాచండీ హోమం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది ఆర్సీ చంద్రశేఖర్ ఉభయంతో దుర్గాంబకు భక్తులు 1008 బిందెల పవిత్ర జలం, 108 బిందెల పాలతో అభిషేక పూజలు చేశారు. అనంతరం ఉభయదారు వరుణ్ కుమార్, ఆలయ మాజీ చైర్మన్ వీకే విశ్వనాథ్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం జరిగింది.

సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వండి


తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రమిస్తున్న ఎస్టీలు

నగరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఎస్టీలు కోరారు. సోమవారం ఈ మేరకు నగరి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు గాంధీ, అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి మాట్లాడుతూ.. మండలంలోని ముడిపల్లె, తడుకుపేట గ్రామాల మధ్య సర్వే నెంబరు 24లోని గుట్టల్లో సుమారు వంద మంది సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతం అక్కడ మామిడి చెట్లు ఉన్నాయని తెలిపారు. సుమారు 30 కుటుంబాలు అక్కడే నివాసం ఉంటున్నాయన్నారు. ఇదే సర్వే నెంబరులో క్వారీ ప్రతిపాదన నిలిపేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, పట్టాలు కావాల్సినవారు సంబంధిత సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

పశువైద్య ఉచిత శిబిరం


రైతులకు సూచనలు చేస్తున్న డాక్టర్ ఆసీఫ్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఊటువంకలో గోపాలమిత్ర సేవలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పశువైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులను పాడి రైతులు సకాలంలో గుర్తించి తగిన వైద్యం చేయించుకోవాలని బంగారుపాళ్యం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ ఆసీఫ్ సూచించారు. డాక్టర్ వెట్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులందరూ సేవింగ్ ఖాతాలు తీసుకోండి


సమావేశంలో ప్రసంగిస్తున్న బాలాజి

నగరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరి సింగిల్ విండో పరిధిలోని రైతులందరూ సేవింగ్ ఖాతాలు తీసుకోవాలని చైర్మన్ బాలాజి కోరారు. సోమవారం నగరిలోని విండో కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సీఈవో తులసి, డీసీసీబీ నగరి బ్రాంచి మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, ఆనంద్, పాల్గొన్నారు.

తిరుమల కొండపై పులివెందుల మార్క్ సెటిల్మెంట్లు చేసిన భూమన, వైవీ: టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ చైర్మన్లు భూమన కరుణాకర రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి హయాంలో తిరుమల కొండపై పులివెందుల మార్క్ సెటిల్మెంట్లు జరిగాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తిరుమల పరకామణిలో డాలర్లు దొంగిలించిన రవికుమార్‌ను కఠినంగా శిక్షించాల్సిందిపోయి, అతడి వద్ద నుంచి శ్రీవారికి రూ.14 కోట్ల విలువైన ఆస్తిని గిఫ్ట్ డీడ్ ఇచ్చి, అదేదో పెద్ద మేలు చేసిన వాడిలా మాట్లాడుతున్నారన్నారు. చేసిన పాపాలన్నింటికీ కరుణాకరరెడ్డి.. దేవుడికి సమాధానం చెప్పాల్సిందేనని హెచ్చరించారు. నేతలు మోహన్‌రాజ్, యువరాజు, ధరణి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నగరి దేశమ్మ గుడి చైర్మన్‌గా మణి



నగరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరి దేశమ్మ గుడికి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రతిపాదనలతో చైర్మన్‌గా నగరి పుదుపేటకు చెందిన కే.ఆర్.మణి, సభ్యులుగా సుశీల, మదన్ కుమార్, సోమసుందరం, మురళి, కృష్ణారెడ్డి, హేమలత, జయంతి, కస్తూరి, లక్ష్మి, ఎక్స్ అఫిసియో సభ్యుడిగా నీలకంఠను ప్రభుత్వం నియమించింది.

వరసిద్ధుడి సేవలో ఎస్పీ తుషార్ డూడి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని ఎస్పీ తుషార్ డూడి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో పెంచలకిషోర్ ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సీఐ శ్రీధర్‌నాయుడు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం: వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన అనిల్‌రెడ్డి రూ.1,00,116 చెక్కును శనివారం సాయంత్రం విరాళంగా అందించారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే 'స్వస్థ్ నారీ..' ధ్యేయం: డీఎంహెచ్‌వో


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకూ క్యాన్సర్ స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ పరిధిలో జరిగే వైద్య శిబిరాలను వైద్యాధికారులు మానిటరింగ్ చేయాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న శిబిరాలను ఆయా డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు తనిఖీలు చేయాలని సూచించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పాఠశాలతో వంద ఇళ్లలో వెలుగులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):ఒక్క పాఠశాల.. వంద ఇళ్లలో వెలుగులు నింపుతుందని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష సహిత విద్య ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సోమవారం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వైద్య నిర్ధారణ శిబిరం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి పదవిని నారా లోకేశ్ చేపట్టాక ప్రైవేటు స్కూల్స్‌కంటే ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన వసతులు ఉన్నాయని చెప్పారు. ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ, సింగిల్‌విండో చైర్మన్ మోహన్‌నాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, మాజీ సింగిల్‌విండో వైస్ చైర్మన్ బాబునాయుడు, ఏంఎసీ డైరెక్టర్లు కామసాని కోదండరెడ్డి, నియాజ్‌అలీ, ఐసీ కోఆర్డినేటర్ మధు, టీడీపీ నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు చందనాలంకారం



బంగారుపాళ్యం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంలోని ముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి చందనాలంకారం చేశారు. ఉభయదారులుగా శాంతినగర్‌కు చెందిన నీలావతి, దాము కుటుంబీకులు వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ ఎంబీ కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నగరిలో..


విశేష అలంకరణలో వాసవీదేవి

నగరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరిలోని నేత్రాప్రదాయణి దేశమ్మ సోమవారం బాలత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుగ్గ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయంలో అమ్మవారు శ్రీశైలపుత్రిగా పూజలందుకున్నారు. కరకంఠేశ్వర ఆలయంలో దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి, నెత్తం కండ్రిగలోని కరుమారి యమ్మ ఆలయాలూ భక్తులతో కళకళలాడాయి.

సరస్వతీదేవి అలంకారంలో మరగదాంబిక



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక దేవి సమేత మణికంఠేశ్వర స్వామి గుడిలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం భక్తుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాగణంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవర్లను కాణిపాకం పుర వీధుల్లో ఊరేగించారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు, మాజీ చైర్మన్ మణి నాయుడు పాల్గొన్నారు.

దుర్గాంబ ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభం



దుర్గాంబను దర్శించుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ - పసుపు అలంకారంలో పొన్నియమ్మ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో సోమవారం దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి పూజను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కుటుంబీకులు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారు భక్తులకు శ్రీమహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ పాలకమండలి చైర్మన్ దిలీప్ ఎరెడ్డి, ఉభయదారు వరుణ్‌కుమార్, మాజీ చైర్మన్ వీకే విశ్వనాథ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే తేనెబండ ముత్యాలమ్మ, సంతపేట కనకదుర్గమ్మ, గిరింపేట శివగామి సుందిరి ఆలయాల్లోనూ అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక, కట్టమంచి షిరిడీ సాయిబాబా ఆలయాల్లో అమ్మవారు బాల త్రిపురసుందరిదేవిగా, బజారు వీధి వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు మహేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవార్లు



రాజరాజేశ్వరి (డీఆర్ఎస్‌కండ్రిగ), నైనేరమ్మ (దేరాకండ్రిగ)

వెదురుకుప్పం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం దేరాకండ్రిగలోని నైనేరమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు ఆముదాల భీమయ్య దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త బుర్రా ఆనంద్, కార్యనిర్వాహకులు డి.ప్రకాష్, కె.గోపాల్, కె.వాసు పర్యవేక్షించారు. ● కార్వేటినగరం స్కంధపుష్కరిణి వద్ద ఉన్న రాజరాజేశ్వరి, వెదురుకుప్పం మండలం డీఆర్ఎస్‌కండ్రిగలోని కొండమల్లీశ్వరస్వామి ఆలయ సముదాయంలో ఉన్న రాజరాజేశ్వరి ఆలయాల్లో అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిగా భక్తులను కటాక్షించారు. అలాగే జీటీకండ్రిగ వద్ద మూలస్థాన ఎల్లమ్మ, గుర్రం వారికండ్రిగలో దుర్గమ్మ ఆలయంలోనూ పూజలు చేశారు.

నగరంలో మోస్తరు వర్షం



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కాగా, వివిధ ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవగా, వర్షం వల్ల భక్తుల రద్దీ తగ్గింది. చాలా ఆలయాలు వెలవెలబోయాయి.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

వెదురుకుప్పం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని విద్యార్థులకు కార్వేటినగరం మండలం కత్తెరపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.చెంగల్రాజు సూచించారు. సోమవారం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో 30 మందికి వృత్తి విద్యా కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఐటీ-ఐటీఎస్, బీఎస్ఎఫ్ఐ ట్రేడ్‌ల్లో పది రోజులపాటు శిక్షణను అందిస్తామని చెప్పారు. గ్రామీణ బ్యాంకు క్రెడిట్ ఆఫీసర్ జాషువా, వృత్తి విద్యా శిక్షకులు హరికృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించండి: కమిషనర్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 4, పింఛనుకు ఒకటి చొప్పున మొత్తం ఐదు అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఏసీ ప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్యకు పరిష్కారం


దారి సమస్యను పరిష్కరించిన అధికారులు

పెనుమూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆస్పత్రి ముందు తమ ఇంటికి వెళ్లే దారిని కళావతి ఆక్రమించుకుందని కలెక్టర్‌కు నాగభూషణం పిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎస్ఐ వెంకటనరసింహం తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమించిన స్థలంలో ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించి, దారిని ఏర్పాటు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. రెండో పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని గ్రీమ్స్‌పేట కృష్ణానగర్‌లో బాబు, కల్పన(45) దంపతులు నివాసం ఉంటున్నారు. గత నెల 29వ తేదీన కల్పన ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారిళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో సోమవారం బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెంగల్రాయనాయుడు కాలువలో పూడికతీత



బంగారుపాళ్యం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకటప్పనాయిని చెరువు నిండి, దిగువ ప్రాంతానికి మొరవ పారుతోంది. ఈ చెరువుకు అనుసంధానంగా సుమారు 10 కిలోమీటర్ల మేరకు పలు చెరువులున్నాయి. అప్పట్లో ఈ చెరువులు నింపడానికి చెంగల్రాయనాయుడు కాలువను నిర్మించారు. ఈ కాలువ మట్టి, ముళ్ల పొదలతో నిండిపోయి నీరు ముందుకు సాగలేదు. దాంతో వెంకటప్పనాయిని చెరువు చైర్మన్ గురుజాల రవీంద్రనాయుడు ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువలో పూడికతీత పనులను సోమవారం చేపట్టారు. పనులను ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

● మంత్రి నారాయణకు కాంట్రాక్టర్ల వినతి

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని చిత్తూరు నగరానికి చెందిన టీడీపీ నాయకులు, కాంట్రాక్టర్లు మంత్రిని కోరారు. సోమవారం అమరావతిలో మున్సిపల్ శాఖమంత్రి నారాయణను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వాటికి సంబంధించిన బిల్లులు వెంటనే మంజూరు చేస్తే మరిన్ని పనులు చేసేందుకు వీలుంటుందని మంత్రికి విన్నవించారు.

'బియ్యాన్ని పాఠశాలలకే సరఫరా చేయాలి'


వెంకటేశ్వరరావుకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బియ్యాన్ని ఆయా పాఠశాలలకే సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వర రావుకు వినతి పత్రం అందించారు. అలాగే పదోన్నతి పొందిన టీచర్లలో కొందరికి కేడర్ మారలేదని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నేతలు రమణ, సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, రెహానాబేగం, రెడ్డెప్ప, పార్థసారధి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన

యాదమరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డ్వాక్రా మహిళలకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. డీఆర్డీఏ పీడీ శ్రీదేవి పర్యవేక్షణలో పెరియంబాడి, 14 కండ్రిగ, అత్తిగారిపల్లె, మోర్థానపల్లె గ్రామాల్లో మహిళలకు 'ఎండీఎంఎల్' యాప్ వినియోగాన్ని సోమవారం ఏపీఎం ఈశ్వరి తెలియజేశారు.

మార్కెట్ సెస్ రాబడికి చేయూత ఇవ్వండి

● కలెక్టర్‌కు పెనుమూరు ఏఎంసీ చైర్మన్ వినతి


కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మామిడి జ్యూస్ ఫ్యాక్టరీల నుంచి మార్కెట్‌సెస్ రాబడికి చేయూత ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణనాయుడు కోరారు. ఈమేరకు చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం కలెక్టర్‌ను వైస్ చైర్మన్, డైరెక్టర్లతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి, సమస్యను తెలియజేశారు. గంగాధరనెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు మండలాల్లో వారం వారం జరిగే కూరగాయల సంతలను కమిటీకి స్వాధీనం చేయాలని కోరారు. ఆయా మండలాల ఎంపీడీవోలతో చర్చించి, చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ అరుల్‌నాధన్, డైరెక్టర్లు కామసాని కోదండరెడ్డి, నియాజ్‌అలీ, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం


తహసీల్దార్ కార్యాలయం వద్ద రమణమ్మ బంధువులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. నల్లవెంగనపల్లె గ్రామపంచాయతీ అల్లంవారికండ్రిగకు చెందిన రమణమ్మ తమ బంధువులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం వచ్చింది. తనకు ఇంటి స్థల విషయమై రెవెన్యూ ఉద్యోగులు న్యాయం చేయలేదంటూ పురుగుమందు తాగేసింది. వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. దీనిపై తహసీల్దార్ బాబు మాట్లాడుతూ.. అల్లవారికండ్రిగకు చెందిన రమణమ్మ, చంద్రమ్మకు ఇంటి పట్టాలు ఉన్నాయన్నారు. తమకు స్థలాలు చూపించాలని విన్నవించడంతో చూపించామని.. రమణమ్మకు అన్యాయం చేయలేదని చెప్పారు. ఇందులో రెవెన్యూ ఉద్యోగుల ప్రమేయం ఏమీ లేదన్నారు. ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడటం మంచిది కాదని హితవు పలికారు. ఈ ఘటనపై సోమవారం రాత్రి వరకు కేసు నమోదు కాలేదు.

సంక్షిప్తంగా..

విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 11, 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నట్లు ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈ కారణంగా మంగళవారం నుంచి ఈనెల 26వతేదీవరకు చిత్తూరు నగరంలోని బజారు వీధి, ఓటీకే రోడ్డు, పరిసర ప్రాంతం, తిమ్మసముద్రం, ఇందిరానగర్, కైలాసపురం, సంతపేట, సీబీ రోడ్డు, చవటపల్లి, గాంధీరోడ్డు, ఎల్ఐసీ కాలనీల్లో అప్పుడప్పుడూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై విచారణ

పాలసముద్రం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరుపై ఎంపీడీవో సతీష్ సోమవారం విచారణ చేశారు. ఉపాధి శ్రామికులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ తమకు సక్రమంగా పనులు కల్పిస్తున్నారని, ప్రభుత్వం 18 వారాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కొందరు శ్రామికులు పనులకు రావడంలేదని తెలిపారు. సర్పంచ్ నరసింహరాజు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో మార్గరెట్, ఈసీ రామమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి: ఆశా వర్కర్లు

వెదురుకుప్పం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బాబుకు నాయకులతో కలిసి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గీత వినతిపత్రం అందజేశారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా జీతాలపై మంత్రివర్గం నిర్ణయం తీసుకుని తీపికబురు చెప్పాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, టీబీ అలవెన్సులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు.

సచివాలయంలో ప్రింటర్ చోరీ

వెదురుకుప్పం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయంలో ప్రింటర్‌ను చోరీ చేశారు. ఆదివారం రాత్రి సచివాలయం తలుపులు పగులగొట్టి ప్రింటర్‌ను ఎత్తుకెళ్లినట్లు ఉద్యోగులు సోమవారం తెలిపారు.

చెత్త సేకరణపై అవగాహన

పూతలపట్టు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేటఅగ్రహారంలో సోమవారం చెత్త సేకరణపై డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గ్రామస్తులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

నగరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల జోలికెళ్లొద్దని ఎం.కొత్తూరు జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్ఎం గీతాకుమారి, ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో సోమవారం 'సే నోటూ ఆల్కహాల్ అండ్ డ్రగ్స్' అంటూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సెలర్ చామంతి తదితరులు పాల్గొన్నారు.

టీబీని కట్టడి చేయాలి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిని కట్టడి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వందమంది క్షయవ్యాధిగ్రస్తులకు 500 విలువైన ఆహార పదార్థాల కిట్లను జేసీ విద్యాధరితో కలిసి అందజేశారు. డీఎంహెచ్‌వో సుధారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీసీహెచ్ఎస్ పద్మజ పాల్గొన్నారు.